

ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 4: ప్రతీ మంగళ, శుక్రవారాల్లో హైదరాబాద్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని గల్ఫ్ ప్రవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘ జేఏసీ ఛైర్మన్ గుగ్గిళ్ల రవి గౌడ్, ప్రధాన కార్యదర్శి పి. స్వదేశ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజాభవన్‌లో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. సమస్యలు ఉన్న ప్రతీఒక్కరూ ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఉద్యోగుల మధ్య ఆధిపత్య పోరు!



• కడెం తహసీల్దార్ వేధిస్తున్నారని నిరసన వ్యక్తం చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సహా రెవెన్యూ ఉద్యోగులు (ఫైల్)



• ఉద్యోగులతో మాట్లాడేందుకు వచ్చిన నిర్మల్ ఆర్డీవో (ఫైల్)



• ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐసీడీఎస్ అధికారిపై చర్యలు తీసుకోవాలంటూ ప్రజాసంఘాల నాయకులు నిరసన (ఫైల్)

» రోజుకో శాఖలో వెలుగులోకి వస్తున్న అవినీతి, అక్రమాలు, పై అధికారుల ఆధిపత్య ధోరణి

» ఇప్పటికే మూడు ప్రభుత్వ శాఖల్లో రచ్చకెక్కిన ఉద్యోగులు

» తాజాగా రెవెన్యూ శాఖల్లో ఉద్యోగుల మధ్య వివాదం

» రెండు చోట్ల పోలీస్ స్టేషన్ మెట్లెక్కిన వివాదం

» రెవెన్యూ శాఖలో సామూహిక సెలవుల కలకలం

» ఖానాపూర్, కడెం మండలాల్లో వివాదాస్పదమవుతున్న పలు శాఖల ఉద్యోగుల తీరు

» ఇంత జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

ఖానాపూర్, ఆగస్టు 4: ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేస్తూ ప్రజలకు సేవలందించాల్సిన అధికారుల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. జిల్లాలో చోటుచేసుకుంటున్న కొన్ని ఘటనలు ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ కిందిస్థాయి సిబ్బందికి ఆదర్శంగా నిలవాల్సిన కొంతమంది అధికారులు ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తున్నారని కిందిస్థాయి సిబ్బంది ఆరోపిస్తున్నారు. తమను తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ కొంతమంది పోలీస్‌స్టేషన్ మెట్లను సైతం ఎక్కుతున్నారు. ఇటీవల తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఖానాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారిపై క్షేత్రస్థాయిలో పనిచేసే ఓ అంగన్‌వాడీ టీచర్ ఉన్నతాధికారులపై పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశారు. మరోవైపు ఖానాపూర్ మున్సిపల్ విభాగంలో పనిచేస్తున్న ఓ వార్డు అధికారికి ఇన్‌చార్జి మేనేజర్‌గా వ్యవహరిస్తున్న జూనియర్ అసిస్టెంట్‌కు మధ్య నెలకొన్న వివాదం చిలికిచిలికి గాలివానగా మారి పోలీస్‌స్టేషన్ వరకూ వెళ్లింది. దీంతో పోలీసులు సదరువార్డు అధికారితోపాటు ఆమె భర్తపై కేసు నమోదు చేసినట్లు చెబుతున్నారు. తాజాగా కడెం మండలంలో రెవెన్యూశాఖలో నెలకొన్న వివాదం కలకలం రేపుతోంది. కడెం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సుజాత రెడ్డి తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని డిప్యూటీ తహసీల్దార్ సహా 13మంది రెవెన్యూసిబ్బంది సామూహిక సెలవులపై వెళ్లడం క్షేత్రస్థాయిలో పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంతమంది అధికారులు రాజకీయ అండదండలతో ఉన్నతాధికారులపై ఒత్తిడి చేస్తూ చర్యల నుంచి తప్పించుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. అయితే జిల్లాలో ఆయా ప్రభుత్వ శాఖల్లో వస్తున్న అవినీతి, ఆధిపత్యపోరుపై రాజకీయ జోక్యంపై మాత్రం స్పందించకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది.

• ఐసీడీఎస్ శాఖలో అవినీతి ఆరోపణల వివాదం


ఖానాపూర్ ఐసీడీఎస్ విభాగంలో నాలుగు నెలల క్రితం పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలు బయటికి పొక్కడానికి ఓ అంగన్‌వాడీ టీచర్‌గా భావించిన ఉన్నతాధికారి నేరుగా ఆమెపై మీడియా ముఖంగా అక్రమ సంబంధం ఆరోపణలు చేశారు. ఈ వివాదంపై సదరు అంగన్‌వాడీ టీచర్ జిల్లా, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినట్లు చెప్తున్నారు. ఈ ఫిర్యాదుతోపాటు తనను సదరు ప్రాజెక్టు లెవెల్ ఉన్నతాధికారి డబ్బుల కోసం వేధించారని ఆరోపిస్తూ పెంబి పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసువర్గాలు వెల్లడించాయి. ఖానాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో నెలకొన్న ఈ వివాదంపై కొద్ది రోజుల క్రితం వరకు ఇన్‌చార్జి డీడబ్ల్యూవో బాధ్యతలు నిర్వర్తించిన ఓ అధికారితో విచారణ సైతం జరిపించారు. ఒక దశలో ఈవిచారణ పారదర్శకంగా జరగడం లేదనే ఆరోపణలు విన్పించాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి సదరు ఇన్‌చార్జి డీడబ్ల్యూవోగా విధులు నిర్వహించిన అధికారి ఇద్దరు స్నేహితులని ఆమె ద్వారా విచారణ జరిపితే సరైన న్యాయం జరగదని పలు ప్రజాసంఘాలు ఆరోపించారు. విచారణ పూర్తయ్యి కూడా నెలరోజులు కావస్తున్న ఇప్పటివరకు బాధ్యులపై కనీసం చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. రాజకీయంగా ఖానాపూర్ పట్టణంలో కీలకస్థానంలో ఉన్న ఓ నేత సదరు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి అండగా నిలుస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. తనకున్న రాజకీయ పలుకుబడితో జిల్లా అధికార యంత్రాంగంపై ఒత్తిడితెస్తూ సదరు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారిపై ఎటువంటి శాఖాపరమైన చర్యలు తీసుకోకుండా అడ్డుపడుతున్నట్లు క్షేత్రస్థాయిలో జోరుగా చర్చ సాగుతోంది. సదరు ఫిర్యాదుచేసిన బాధితురాలిని సైతం రోజుకో రకంగా వేధింపులకు గురిచేస్తూ తమతో రాజీకి రావాలని లేనిపక్షంలో ఉద్యోగం ఊడుతుందని బెదిరిస్తున్నట్లు చెప్తున్నారు. రోజుకో పద్ధతిన నిజాలు బహిర్గపర్చిన అంగన్‌వాడీ టీచర్‌ను ఇబ్బందులకు గురిచేసిన సదరు ఉన్నతాధికారి ఈ మధ్యకాలంలో తనతో రాజీ కుదుర్చుకునేందుకు ఒత్తిడి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అక్రమాలను బయటకు చెప్పిన వారికి అండగా నిలవాల్సిన ఉన్నతాధికారులు రాజకీయఒత్తిళ్లకు తలొగ్గి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉన్నతాధికారికే మద్దతివ్వడంతో సదరు వ్యవహారంలో నిజాలు చెప్పేందుకు ముందుకొచ్చిన చిరు ఉద్యోగి మానసికధైర్యాన్ని దెబ్బతీస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

• మున్సిపల్ శాఖలో విధుల హాజరుపై వివాదం

ఖానాపూర్ మున్సిపల్ ఉద్యోగుల మధ్య నెలకొన్న వివాదం చిలికి గాలివానగా మారింది. రెవెన్యూశాఖ నుంచి సర్దుబాటులో భాగంగా ఖానాపూర్ మున్సిపల్ విభాగానికి బదిలీ అయిన కొంతమంది అధికారుల మధ్య ఆధిపత్యపోరు సాగుతున్నట్లు చెబుతున్నారు. వీఆర్‌వోగా బాధ్యతలు నిర్వహించి జూనియర్ అసిస్టెంట్‌గా ఖానాపూర్ మున్సిపల్‌కి బదిలీపై వచ్చిన ఓ అధికారికి ఉన్నతాధికారులు ఇన్‌చార్జి మేనేజర్‌గా బాధ్యతలను అప్పగించారు. ఉద్యోగులంతా సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని సదరు మేనేజర్‌కు మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఆదేశాలు జారీచేశారు. దీంతో అందరూ సకాలంలో హాజరు కావాలని మేనేజర్‌గా విధులు నిర్వహించిన సురేందర్ సిబ్బందిని కోరారు. ఈ క్రమంలో జూలై 4వ తేదీన విధులకు సకాలంలో హాజరు కాకపోవడంతో రెండో వార్డు అధికారిగా విధులు నిర్వహి స్తున్న ఓ అధికారికి సదరు మేనేజర్ హాజరు పట్టికలో సెలవుగా పరిగణిస్తూ సీఎల్ వేశారు. దీంతో ఈ ఇరువురి మధ్య నెలకొన్న వివాదం చిలికి గాలివానగా మారింది. పోలీస్‌శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న తన భర్తకు సదరు వార్డు అధికారి జరిగిన విషయం ఫోన్ ద్వారా వెల్లడించడంతో వీడియో కాల్‌చేసి సదరు మేనేజర్‌ను అసభ్య పదజాలంతో అందరి సమక్షం లోనే సదరు హోంగార్డు దూషించినట్లు మున్సిపల్ ఉద్యోగులు, అధికారులు చెప్తున్నారు. సదరు వార్డు అధికారి భర్త మేనేజర్‌ను దూషించే సమయంలో మున్సిపల్‌చైర్మన్ సత్యం సహా మరోకౌన్సిలర్ భర్త సైతం అక్కడే ఉన్నట్లు చెప్తున్నారు. జరిగిన ఘటనపై సురేందర్ ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా సదరు వార్డు అధికారిపై ఆమె భర్తపై పోలీసులుకే ఫిర్యాదు చేశారు.

• సామూహిక సెలవుల కలకలం

కడెంలో నెలకొన్న వివాదం చిలికి గాలివానలా మారింది. కడెం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి సుజాత రెడ్డి తమను వేధిస్తున్నారని సిబ్బంది సన్నిహితుల వద్ద వాపోతున్నట్లు ప్రచారంసాగింది. ఇదంతా సుమారు ఆరునెలలపాటు నివురుగప్పిన నిప్పులాగా లోలోపల మాత్రమే సాగినా ఈనెల 1న ఒక్కసారిగా బయటకు వచ్చింది. ఇక తహసీల్దార్ వేధింపులు తాము తాళలేమని, ఇక్కడ ఉద్యోగం చేయలేమని పేర్కొంటూ డిప్యూటీ తహసీల్దార్ సహా 13మంది రెవెన్యూ ఉద్యోగులు సామూహిక సెలవుపత్రం ఇవ్వడం జిల్లాలో దుమారం రేపింది. ఉలిక్కిపడ్డ జిల్లా అధికార యంత్రాంగం దిద్దుబాటు చర్యలను చేపడుతూ ఇటు డిప్యూటీ తహసీల్దార్ సహా మిగతా రెవెన్యూ ఉద్యోగులకు తహసీల్దార్‌కు మధ్యసయోధ్య కుదిర్చేందుకు 2న నిర్మల్ ఆర్డీవోను రంగంలోకి దింపింది. ఉద్యోగుల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించేందుకు ఆర్డీవో రత్న కళ్యాణి శుక్రవారం కడెం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి సామూహిక సెలవుపత్రం ఇచ్చిన ఉద్యోగులతో మాట్లాడారు. ఆర్డీవో సముదాయించడంతో వెనక్కి తగ్గిన రెవెన్యూ ఉద్యోగులు సామూహిక సెలవుల నుంచి విరమించుకున్నట్లు తెలిసింది. ఇటువంటి చర్యలు చోటుచేసుకున్నప్పుడు తూతూ మంత్రంగా కంటి తుడుపు చర్యలు చేపట్టకుండా అసలు క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటే ప్రజాస్వామ్యం వ్యవస్థలో పాలకులపై ప్రజలకు మరింత విశ్వాసం పెరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పైన జరిగిన మూడు ఘటనలు బయటకు రావడంతో జిల్లావ్యాప్తంగా ఉద్యోగుల మధ్య ఎటువంటి తదంగాలు కొనసాగుతున్నాయో చెప్పడానికి అద్దం పడుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వెంటనే జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై హద్దులు మీరి ప్రవర్తిస్తున్న అధికారులను అదుపులో పెట్టడంతో పాటు అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



• సిబ్బంది అందజేసిన సామూహిక సెలవు పత్రం (ఫైల్)



• మున్సిపల్‌లో నెలకొన్న వివాదంపై వివరాలు వెల్లడిస్తున్న మేనేజర్ (ఫైల్)



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

హరిహర క్షేత్రంలో కుంకుమార్చన

నిర్మల్ కల్చరల్, ఆగస్టు4: నిర్మల్‌లోని హరిహర క్షేత్రంలో మల్లన్న గుట్టపై కొలువైన లలితా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆషాఢ అమావాస్య సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త అల్లోల వినోదమ్మ హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. గురుస్వామి మూర్తి, కోశాధికారి వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో తీర్థప్రసాద వితరణ గావించారు.

గౌడ జాతీయ సమ్మేళనానికి మోకుదెబ్బ జాతీయ కమిటీ సభ్యులు

ముథోల్, ఆగస్టు4: మధ్యప్ర దేశ్ రాజధాని భోపాల్‌లోని ఎల్ఎన్‌సీటీ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆగస్టు 3, 4న తలపెట్టిన గౌడ జాతీయ సమ్మేళనా నికి జిల్లా నుంచి మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, ప్రతినిధులు పాల్గొ న్నారు. ఈ సమ్మేళనం ముగింపునకు మధ్య ప్రదేశ్ సీఎం డాక్టర్ మోహన్‌యాదవ్ హాజరైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్ధిరాములుగౌడ్, జాతీయప్రధాన కార్యదర్శి కొండాపురం బాలరాజ్ గౌడ్, జాతీయ కోశాధికారి ఏవీ బాలేశం గౌడ్, జాతీయ అధికార ప్రతినిధి బాలసాని సురేష్ గౌడ్, 22 రాష్ట్రాల గౌడ ప్రతినిధులు, మహిళలు, మేధావులు పాల్గొన్నారని వివరించారు.

మాంసం విక్రయ కేంద్రాల వద్ద కొనుగోలుదారుల కిటకిట

భైంసా, ఆగస్టు 4: పట్టణ పరిధిలోని మాంసపు విక్రయ కేంద్రాలు ఆదివారం కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఆదివారం జాముల అమావాస్య రావడంతోపాటు సోమవారం నుంచి శ్రావణ మాసం అరంభమవుతున్న నేపథ్యంలో నాన్‌వెజ్ ప్రియులు మేక, కోడి మాంసాలు కొనుగోలు చేయడానికి విక్రయ కేంద్రాలకు వరుస కట్టారు. ఇక్కడి ప్రాంతంలోని అధికమంది నాన్‌వెజ్ ప్రియులు శ్రావణమాసంలో మాంసాహారాలు, మద్యపానానికి దూరంగా ఉంటారు. దీంతో శ్రావణ మాసం అరంభానికి ఆదివారం ఒక్క రోజే గడువు ఉండటంతో వారందరూ మాంసాహారాలు తినేందుకు ఎగబడ్డారు. ఈ కారణంగా పట్టణ పరిధిలోని మేక, కోడి మాంసాల విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో రద్దీగా కనిపించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వేళ వరకు విక్రయకేంద్రాల వద్ద కొనుగోలుదారుల సందడి కనిపించింది. ఇదే క్రమంలో వైన్స్‌ల వద్ద సైతం ఇదే తరహా సందడి కొనసాగింది.



మాంసం విక్రయ కేంద్రం వద్ద సందడి

సంబరాల్లో లంబాడీలను కలవనీయం

• అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా జరపాలి • ఆదివాసీల ఆత్మ గౌరవాన్ని చాటాలి: తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమయ్య

నిర్మల్‌అర్బన్, ఆగస్టు4: ప్రపంచ మూల వాసులైన ఆదివాసీల భావితరాల అస్థిత్వ మనుగడ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, ఆదివాసీల భారత రాజ్యాంగ హక్కుల అమలు కోసం ఆదివాసిలు ప్రజాపోరాటానికి సమాయత్తం కావాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆదివాసీలకు పిలుపునిస్తుందని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిర్మల్ జిల్లావ్యాప్తంగా అన్ని గూడాల్లో, గ్రామాలలో ఆగస్టు 9న జరగబోయే అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవ కార్యక్రమం కోసం నిర్వహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన సర్క్యులర్‌ను తాము వ్యతిరేకిస్తున్నామని, లంబాడీలతో కలిసి ప్రపంచ ఆదివాసి దినోత్సవ సంబరాలను జరుపుకోబోమని, వారిని ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాల్సిందేనని తెలిపారు. లేదంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని, ఆదివాసీల హక్కులు, చట్టా లు అమలు కావాలంటే ఆదివాసీలు ఓటు బ్యాంక్ రాజకీయ పార్టీల మైకం నుంచి బయటకు వచ్చి ని రంతరం పోరాటాలు చేసి తమ భారత రాజ్యాంగ హక్కులు, చట్టాలు సాధించుకోవాలని, దోపిడీ బూర్జువ పరిపాలకులను నమ్మకోవద్దని కోరారు. ఏమీఉండదని చట్టసభల్లో బూర్జువ అగ్రకుల నాయకుల పెత్తనం కోసం ఆదివాసీలకు న్యాయం చేస్తామని నమ్మబలికి ఆదివాసీలకు పంగనామాలు పెట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయని, అందుకే ఆదివాసీలు తమ ప్రయోజనం కోసం బూర్జువ పార్టీలకు దూరముంటూ మనుగడ పోరాటం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

పేద కుటుంబంలో విద్యాకుసుమం

• ఆరు ప్రభుత్వ ఉద్యోగాలకు అవలీలగా ఎంపికైన ఎలగడప వాసి

• ఇటీవల విడుదలైన పంచాయతీ రాజ్ ఏఈఈ ఫలితాలతోపాటు మరో ఐదు ఉద్యోగాలకూ అర్హత



దుర్గం రాజశేఖర్

ఖానాపూర్, ఆగస్టు 4: రెక్కాడితే గానీ డొక్కాడని సామాన్య నిరుపేద, మధ్య తరగతి కుటుంబానికి చెందిన కడెం మండలం ఎలగడప గ్రామ వాసి దుర్గం రాజశేఖర్ ఆరు ప్రభుత్వ ఉద్యోగాలకు అవలీలగా అర్హత సాధించాడు. ఎలగడపకు చెందిన దుర్గం లక్ష్మీ నర్సయ్య దంపతుల పెద్ద కుమారుడు దుర్గం రాజశేఖర్. నర్సయ్య తన రెండెకరాలతో పాటు కొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయాన్ని సాగిస్తూ పిల్లలను చది వించాడు. పెద్ద కుమారుడు దుర్గం రాజశేఖర్ 2023లో ఆరు ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాశాడు. ప్రస్తుతం ఆ పోటీ పరీక్షల తాలూకు ఫలితాలు ఒక్కొక్కటిగా వెలువడుతుండగా రాజశేఖర్ రాసిన ప్రతీ పరీక్షలోనూ ప్రతిభ కనబర్చి ఆరు ఉద్యోగాలకు అర్హత సాధించాడు. ఈనెల 2న విడుదలైన పంచాయతీరాజ్ ఏఈఈ పరీక్ష ఫలితాల్లో మెరిట్ సాధించి ఆ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అంతకుముందే విడుదలైన గ్రూప్ 4, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్, పాలిటెక్నిక్ లెక్చరర్, అసిస్టెంట్ ఇంజనీర్, జూనియర్ టెక్నికల్‌ఆఫీసర్ ఉద్యోగాలకు అర్హత సాధించాడు. ఆరు ప్రభుత్వఉద్యోగాలకు అర్హత సాధించిన రాజశేఖర్‌ను పలువురు అభినందిస్తున్నారు.

• ఏఈఈ ఫలితాల్లో మెరిసిన అన్నదమ్ముళ్లు

దస్తురాబాద్: నిరుపేద కుటుంబానికి చెందిన అన్నదమ్ములు టీజీపీఎస్సీ ఉద్యోగ ఫలితాల్లో సత్తాచాటి ఇద్దరూ ప్రభుత్వఉద్యోగాలకు ఎంపికయ్యారు. మండలంలోని బుట్టాపూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి పోషలింగు మల్లవ్వ దంపతుల ముగ్గురు కుమారుల్లో రాజేందర్ రోడ్డు భవనాల శాఖలో, సురేందర్ పంచాయతీరాజ్ శాఖలో ఏఈఈ ఉద్యోగాలు సాధించారు. రెండో కుమారుడు దేవేందర్ 2018లో విద్యుత్ ఏఈగా ఉద్యోగం సాధించాడు. పోషలింగు మల్లవ్వ దంపతుల వ్యవసాయకూలీ పనిచేస్తూ వీరిని చదించారు.

పూర్వ విద్యార్థుల రజతోత్సవ సమ్మేళనం

నిర్మల్ అర్బన్, ఆగస్టు 4: స్నేహితుల దినోత్సవ వేళ పాతికేళ్ల క్రితం చదువుకున్న కళాశాలలో పూర్వవిద్యార్థులు గురువుల సమక్షంలో రజతోత్సవ సమ్మేళనం అందరిలో ఆనందాన్ని నింపింది. 1997-99 విద్యాసంవత్సరం ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల చదువుకున్న విద్యార్థులు సుదీర్ఘకాలం తర్వాత కలుసుకుని చదువుచెప్పిన అప్పటి జ్ఞాపకాలను పంచుకున్నారు. గురువులను సన్మానించి ఆనందకరమైన వాతావరణంలో రజత్సోతవం సాగింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సాయన్న, లెక్చరర్లు మారుతి రావు, వెంకట్, వినోద్ పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు, సమన్వ యకర్తలు సాయిప్రసాద్, అరుణ్, శ్రీహరి, సబితా, సంధ్య ఉన్నారు.



రజతోత్సవ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

బాసర గోదావరిలో మరో రెండు మృతదేహాలు

• వేర్వేరుగా నదిలో పడి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తుల మృతి • వారం రోజుల్లో నాలుగు మృతదేహాల గుర్తింపు

బాసర, ఆగస్టు, 4: బాసర వద్దగల గోదావరి నదిలో ఆదివారం మరో రెండు మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. వేర్వేరు చోట్ల గుర్తించిన పోలీసులకు మృతులకు సంబంధించిన వివరాలు ఏవీ లభించలేదు. అయితే వారంరోజుల్లో నాలుగు మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. ఆదివారం గుర్తించిన మృతుల్లో ఒకరు వృద్ధుడు ఉండగా, మరొకరు 45 వయస్సు వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. వృద్ధుడి శరీరంపై తెలుపురంగు దుస్తులు, మరోవ్యక్తిపై సిమెంట్ కలర్ ప్యాంటు, రెడ్ కలర్ టీషర్ట్ ధరించి ఉన్నారని, సంబంధీకులు ఎవరైనా ఉంటే బాసర పోలీసులను సంప్రదించాలని వారు వెల్లడించారు. అయితే గత కొన్నిరోజుల నుంచి నది తీరంలో వరుసగా మృతదేహాలు లభించడంపై స్థానికుల్లో ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. వివిధ కారణాలతో బాసర వచ్చి ఆత్మహత్యలకు పాల్పడేవారు అధికంగా ఉంటున్నారు. పోలీసులు స్థానికుల సహకారంతో అనేకమందిని కాపాడుతున్నా ఇంకా కొన్నిఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఆదివారం ఘటనలపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.



నది తీరం వద్ద మృత దేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

• వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

లక్ష్మణచాంద, ఆగస్టు 4: సోమవారం నిర్వహించ తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా నాయకులు కొండ రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలు చేపట్టాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా కలెక్టరేట్‌కు వెళ్లి మెమోరాండం సమర్పించి తమ నిరసనను ఈ కార్యక్రమం ద్వారా తెలపటం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా వర్గీకరణకు వ్యతిరేకంగా భవిష్యత్ కార్యాచరణ కోసం మేధోమధనం చేసి పకడ్బందీ వ్యూహం ద్వారా ముందుకు వెళ్లటం జరుగుతుందని ఈ సందర్భంగా స్పష్టంచేశారు. మాలలు, మాల ఉపకులాలు ఉదయం 10 గంటల వరకు నిర్మల్ జిల్లాలోని ఎల్లపెల్లిలో కలెక్టర్ కార్యాలయానికి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రైవేట్ ఉపాధ్యాయుల మనోభావాలు కించపర్చడం తగదు

• సీఎం క్షమాపణలు చెప్పాలి: ప్రైవేట్ టీచర్లు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 4 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రైవేట్ ఉపాధ్యాయుల మనోభావాలు కించపరిచే విధంగా మాట్లాడడం తగదని నిర్మల్ జిల్లా ప్రైవేట్ టీచర్ల సంఘం పేర్కొంది. ఆదివారం ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. అర్హత లేనివారు ప్రైవేట్ పాఠశాలల్లో బోధిస్తున్నారని అనడం సరికాదన్నారు. అన్ని అర్హతలున్నప్పటికీ ప్రభుత్వ నిర్వాకంతో ఉద్యోగాలు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా అర్హతలు కలిగి ప్రైవేట్ పాఠశాలలో నాణ్యమైన బోధన అందిస్తున్నందునే విద్యార్థుల సంఖ్య ఇక్కడ ఎక్కువగా ఉందన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. హరీష్, రాంప్రసాద్, పండరినాథ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

అడెల్లి పోచమ్మకు ప్రత్యేక పూజలు

సారంగాపూర్, ఆగస్టు 4: మండలంలో గల అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సీఐ రామకృష్ణ సైతం ఆలయానికి వచ్చి మొక్కులను మొక్కారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీనివాస్ అమ్మవారికి హారతినిచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించారు. ఈయనవెంట ఎస్సై శ్రీకాంత్, ఆలయ సిబ్బందిలు ఉన్నారు.



సీఐని సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

విద్యుత్తుషాక్‌తో కాంగ్రెస్ నాయకుడి మృతి

ఉట్నూర్, ఆగస్టు 4 : ఉట్నూర్ మండల కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు సలీం (40) ఆదివారం కరెంట్‌షాక్‌కు గురై మృతిచెందాడు. పట్టణానికి సమీపంలో ఉన్న హర్కాపూర్ వద్ద మెకానిక్ షెడ్డు నిర్మించుకుని వృత్తిరీత్యా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం తన మెకానిక్‌షెడ్‌లోనే కార్‌వాటర్ సర్వీసింగ్ సెంటర్ ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశాడు. ఉదయమే షెడ్‌వద్ద క్లీనింగ్ చేయడానికి మోటార్ స్టార్ట్ చేయగానే కరెంట్‌షాక్‌కు గురై పక్కనే ఉన్న నీటి గుంటలో పడిపోవడంతో మృతిచెందినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. సలీం మృతితో కాంగ్రెస్ పార్టీలో విషాదం నెలకొంది. సలీంకు భార్యతో పాటు వృద్ధురాలు అయిన తల్లి అమీనా, ఇద్దరు కొడుకులు ఇద్దరు బిడ్డలున్నారు. ఉట్నూర్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బురద రోడ్లతో ఇబ్బందులు

● గిరిజన గ్రామాల్లో ప్రజలకు కష్టాలు



సిరికొండ నుంచి లఖంపూర్(బీ)కు వెళ్లే దారి

సిరికొండ, ఆగస్టు 4: మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు, రవాణా సౌకర్యం లేక ఆదివాసులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. చినుకు పడితే చాలు చిత్తడి అవుతున్నాయి. నిత్యం రాకపోకలు సాగించే పాదచారులకు, వాహనదారులకు నరకాన్ని చూపిస్తున్నాయి. రోడ్ల మరమ్మతులకు లక్షలాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నప్పటికీ ఆశించిన మేర ఫలితం దక్కడం లేదు. కాంట్రాక్టర్లు, అధికారుల కాసుల కక్కుర్తితో నాణ్యత లోపిస్తుంది. దాంతో కొన్ని చోట్ల నెలలు తిరగకుండానే రోడ్లు పాడవుతుంటే, మరికొన్ని రోడ్లు వర్షపు చినుకులకే ధ్వంసం అయిపోతున్నాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు సిరికొండ మండల కేంద్రం నుంచి లఖంపూర్, జెండాగూడ, రాజులగూడ, బూర్సిగుట్ట, పాలవాగు, భీంపూర్, వాయిపేట్, కుంటగూడ, రిమ్మ, కొలాంగూడ తదితర గ్రామాలకు వెళ్ళే రోడ్లు బురదమయంగా మారి అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. వరదలకు పెద్దపెద్ద గుంతలు ఏర్పడి నీరు నిలిచిపోవడంతో గుంతల వల్ల పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు సందర్భాల్లో ద్విచక్ర వాహనదారులు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. తక్షణమే సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆదివాసీ గిరిజన గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదివాసులు కోరుతున్నారు.



సిరికొండ నుంచి రాజులగూడకు వెళ్లే దారి


భైంసాలో ముస్తాబైన శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయం

నేటి నుంచి శ్రావణ మాస వేడుకలు

● ముస్తాబైన ఆలయాలు

భైంసా/ముథోల్, ఆగస్టు 4: శుభప్రదంగా భావించే పవిత్ర శ్రావణమాసం సోమవారం నుంచి ప్రారంభమవుతోంది. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని ప్రధాన ఆలయాలు శ్రావణ మాసవేడుకలకు ముస్తాబు అయ్యాయి. అన్ని మాసాల్లోకెల్ల శ్రావణమాసం ఎంతో విశిష్టమైనది. ఆధ్యాత్మిక ఆరాధనలకు నెలవు, పండుగల మాసంగా పేరొందిన శ్రావణ మాసం వేడుకలను ఘనంగా నిర్వహించే మహిళలు సిద్ధమయ్యారు. నెల రోజుల పాటు అత్యంత నియమ, నిష్టలతో భక్తితత్వాన్ని అందించే పండుగలను జరుపుకోనున్నారు. సోమ, మంగళ, శుక్రవారాల్లో ఆలయాన్నీ భక్తులతో కిటకిటలాడనున్నాయి. ఈ నెల 6, 13, 20, 27 వచ్చేనెల 3వ తేదీల్లోని మంగళవారాల్లో మంగళగౌరి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. 9న నాగపంచమి, 16న సామూహిక వరలక్ష్మీవ్రతం, 19 అన్నచెల్లెల అనుబంధానికి గుర్తుగా రక్షాబంధన్, 26న కృష్ణ జన్మాష్టమి తదితర వేడులకు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. పండుగలు జరుపుకునే ఆలయాలను నిర్వాహక కమిటీ ప్రతినిధులు ము స్తాబు చేశారు. నెలరోజుల పాటు ఆలయాల్లో ఉదయం, రాత్రివేళల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగనున్నాయి. భైంసా పట్టణంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం, గోపాలకృష్ణ మందిరం, మహదేవ్ మందిర్, సాయిబాబా మందిర్, నర్సింహ స్వామి మందిరం, శివాలయం తదితర మందిరాలను వేడుకల కోసం గాను నిర్వాహక కమిటీ ప్రతినిధులు ముస్తాబు చేశారు.


ముస్తాబైన ముథోల్‌లో పశుపతినాథ్ శివాలయం


ఒక్కగేటును ఎత్తి దిగువకు వదులుతున్న నీరు



ఆదివారం కడెం ప్రాజెక్టులో బోటింగ్ చేస్తున్న సందర్శకులు


కడెం ప్రాజెక్టు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

నిండుకుండలా కడెం

- క్రమేపీ పెరుగుతున్న సందర్శకుల తాకిడి ● రెండు రోజులుగా భారీగా తరలివస్తున్న సందర్శకులు
- జలాశయంలో బోటింగ్ చేసేందుకు పర్యాటకుల ఆసక్తి
- సెలవుదినం కావడంతో బోటింగ్ పాయింట్ వద్ద పర్యాటకుల కిటకిట
- కడెం ప్రాజెక్టు ఒకగేటు ఎత్తివేత ● కడెం అందాలను తిలకిస్తూ మంత్రముగ్దులవుతున్న పర్యాటకులు

ఖానాపూర్, ఆగస్టు4: కడెం జలాశయం నిండుకుండలా మారుతోంది. గత నెల రోజుల క్రితం వరకు ప్రాజెక్టులో నీళ్లు సరిగా లేక కళతప్పిన కడెం ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గత కొద్ది రోజులుగా క్రమేపీ జలకళను సంతరించుకొని తాజాగా నిండుకుండలా దర్శనమిస్తోంది. కడెం ప్రాజెక్టు జలకళను సంతరించుకోవడంతో ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి క్రమేపీ పర్యాటకులు కడెంకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా కడెం ప్రాజెక్టు వద్ద సందర్శకుల తాకిడి కనిపిస్తుంది. ఆదివారం సెలవు దినం కావడంతో ప్రాజెక్టు వద్ద పలువురు పర్యాటకులు సందడి చేశారు. కడెం జలాశయంలో బోటింగ్ చేస్తూ సరదాగా గడిపారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు వంద మందికి పైగా ప్రాజెక్టులో బోటింగ్ చేసినట్లు బోటింగ్ విభాగం ఇంచార్జి తిరుపతి తెలిపారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు కడెం ప్రాజెక్టులోకి 3 వేల క్యూసెక్కులకు పైగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో అధికారులు అప్రమత్తమై ఆదివారం ప్రాజెక్టు వరద గేట్లలో ఒక్క దానిని తెరిచి 3,715 క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 696.350 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 6.684 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. సందర్శకులతో ప్రాజెక్టు వద్ద రద్దీ నెలకొంది.




వరద నీరు చేరికతో నిండుకుండలా దర్శనమిస్తున్న కడెం ప్రాజెక్టు


కడెం ప్రాజెక్టులో బోటింగ్ చేస్తున్న సందర్శకులు

ముసురు వర్షం.. ముందుకు సాగని పనులు

- ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు ● పంటలు జౌకుబారీ పోతున్నాయంటూ రైతుల ఆందోళన
- ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి చేరుతున్న వరదనీరు ● మావలలో 9.8 మి.మీ. అత్యధిక వర్షపాతం నమోదు

ఆదిలాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షాలతో సాగుపనులు ముందుకు సాగడం లేదు.ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓ మోస్తరు స్థాయిలో వర్షం కురిసింది. అత్యధికంగా మావల మండలంలో 9.8 మి.మీ., తలమడుగులో 9.3, ఇచ్చోడలో 6.5, బోథ్‌లో 4.8, ఆదిలాబాద్ అర్బన్‌లో 3.5 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. కురుస్తున్న వర్షాలతో కుంటలు, చెరువులు ప్రాజెక్టులోకి వరద నీరువచ్చి చేరుతుంది. ముసురు వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లోని పంటలు జౌకుభారీ పోతున్నాయని రైతులు వాపోతున్నారు.ఇదే పరిస్థితులు మరికొన్నాళ్ల పాటు ఉంటే పంటలు చేతికి వచ్చే పరిస్థితి ఉండదంటున్నారు. కలుపు నివారణకు అవకాశం లేక పోవడంతో పంటలను కలుపు మొక్కలు కప్పేస్తున్నాయని, అలాగే సమయానికి రసాయన మందుల పిచికారి చేయక పోవడంతో పంటలను చీడపీడలు ఆశిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. సాత్నాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 286.50 మీటర్లు కాగా ప్రస్తుతం 284.80 మీటర్లకు చేరుకుంది.అలాగే మత్తడివాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 287.50 మీటర్లు కాగా ప్రస్తుతం 276.60 మీటర్ల వద్ద నీటి మట్టం కనిపిస్తుంది. ప్రాజెక్టుల్లో వరద నీరు చేరడంతో అయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు చేస్తున్నారు.ముఖ్యంగా వాగుల్లో ప్రవహిస్తున్న వరద నీటిని దాటేందుకు ప్రయత్నించవద్దని సూచిస్తున్నారు.


కుంటాల జలపాతం వద్ద యువకుల సందడి


వర్షంలో నడుచుకుంటూ వెళుతున్న మహిళలు


ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో జోరుగా కురుస్తున్న వర్షం

కుంటాల జలపాతం వద్ద పర్యాటకుల సందడి

నేరడిగొండ: జిల్లావ్యాప్తంగా గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలపాతాలు జలకళ సంతరించుకున్నాయి. ఇందులో భాగంగా ఎగువన ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నేరడిగొండ మండలంలోని ప్రసిద్ధిగాంచిన కుంటాల జలపాతం పరవళ్లు తొక్కుతుంది. పెద్ద శబ్దాలతో జాలువారుతున్న నీటిని చూసి స్థానికులు, పర్యాటకులు మంత్రముగ్ధులవుతున్నారు. రాష్ట్రంలో ఎత్తైన జలపాతాలలో కుంటాల జలపాతం ఒకటి.

ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ..

అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన

తలమడుగు, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆదివారం తలమడుగు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఎస్సీలు అంత ఐక్యంగా ఉన్నప్పటికి ఐక్యతను విడగొట్టేందుకు వర్గీకరణ బిల్లును చేపట్టడం శోచనీయమన్నారు. వెంటనే సుప్రీం కోర్టు వర్గీకరణ బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం తలమడుగు గ్రామ కమిటీ అధ్యక్షుడు భూత దేవన్న ,చంటి, నేతుల గంగన్న, నారాయణ , వేణు.శ్రీనివాస్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.


తలమడుగులో ధర్నా చేస్తున్న మాల సంక్షేమ సంఘం నాయకులు

● **8 నుంచి జంతర్‌మంతర్ వద్ద ధర్నా**

ఉట్నూర్: ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం తీర్పును సమర్థిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వాలు జనాభాగణన లేకుండానే ఎస్సీ వర్గీకరణను పూను కుంటామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని దీనికి నిరసిస్తూ దేశ రాజధానిలోని జంతర్‌మంతర్‌వద్ద ఈనెల 8నుంచి మూడు రోజుల పాటు ధర్నాలు నిర్వహించనున్నామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కులాల జేఏసీ నాయకులు ప్రకటించారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బొంకంటి సుభాస్, కాంబ్లె ప్రజ్ఞశీల్‌లు మాట్లాడుతూ దళితుల మధ్య ఐక్యతను తొలగించడానికి రాజ్యాంగ స్ఫూర్తిని మరిచి పోయి ఎస్సీ వర్గీకరణకు పూనుకుంటామని ప్రకటించడం సరైంది కాదన్నారు. ఆర్టికల్ 340, 341 ప్రకారం క్యాబినెట్‌కు గాని, రాష్ట్రపతికి మాత్రమే వర్గీకరణ చేసే అవకాశం ఉందన్నారు. ఈనెల 21న నిర్వహించనున్న భారత్‌బంద్ విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోడిబలవంత్, దూట మహేందర్, గణేష్, నారాయణ, ఆకాశ్, దుర్గయ్య, ఆజడి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.


అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఐదు కిలోల గంజాయి స్వాధీనం

ఇంద్రవెల్లి, ఆగస్టు 4: మండలంలోని చోర్‌గాం గ్రామానికి చెందిన సాబ్లే బాక్సుంద్‌సింగ్ అక్రమంగా గంజాయి తరలిస్తుండగా వాహనాల తనిఖీలో పట్టుబడినట్లు ఉట్నూర్ సీఐ మొగిలి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం ముందస్తు సమాచారం మేరకు ఆదివారం మండలంలోని ఈశ్వర్‌నగర్ సమీపంలో నర్సపూర్ చౌక్ వద్ద వాహనలను తనిఖీ చేస్తుండగా చోర్‌గాం గ్రామానికి చెందిన సాబ్లే బాక్సుంద్‌సింగ్ ద్విచక్ర వాహనంతో గంజాయి అమ్మడానికి ఆదిలాబాద్ తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న గంజాయిని స్వాధీనం చేసి పంచమా నిర్వహించి బాక్సుంద్ సింగ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అక్రమంగా గంజాయి సాగు చేసినా.. తరలించినా తమ దృషికి వస్తే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దుబ్బక సునీల్, పోలీసులు కానిస్టేబుళ్లు ఉన్నారు.

పాము కాటుతో మహిళ మృతి


లక్ష్మి మృతదేహం

గుడిహత్నూర్, ఆగస్టు 4: మండలంలోని సోమర్‌పేట్ గ్రామానికి చెందిన సిడాం లక్ష్మి(26) అనే మహిళ సాముకాటుతో మృతి చెందినట్లు గుడిహత్నూర్ ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు శనివారం నెలసరి రుతుక్రమం అయింది. కొలం గిరిజనుల ఆచారాల ప్రకారం కుటుంబ సభ్యులు ఆమెకు కేటాయించిన ఇంటి ముందు ఉన్న చెపిరిలో రాత్రి పడుకుంది. ఆదివారం తెల్లవారుజామున కుడి కాలు పాదం వైపు ఏదో విషపు పాముకాటు వేసింది. కాలు మంటగా ఉందని కడుపులో తిప్పుతుందని ఆమె కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్ధరాత్రి వైన్స్‌లో దొంగతనం

ఇచ్చోడ, ఆగస్టు 4: మండలంలోని అడేగామ(కె) గ్రామ శివారులోని రేణుక వైన్స్‌లో అర్ధరాత్రి నలుగురు దుండగులు చోరబడి రూ.30వేల నగదుతో పాటు రూ.2వేల విలువ గల మద్యం సీసాలను దొంగలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి 2 నుంచి 3 గంటల సమయంలో నలుగురు వ్యక్తులు వైన్స్ ముందుభాగంలోని షెటర్‌ను ఇనుపరాడ్లతో ధ్వంసం చేసి లోనికి వెళ్లి దొంగలించడం జరిగిందని, వైన్స్ మరో పక్క ఉన్న గోడను రాడ్లతో కొట్టి పగులగోడదామని ప్రయత్నించినా అది సాధ్యం కాకపోయేసరికి నేరుగా షెటర్‌ను పగులగోట్టి లోనికివెళ్లి దొంగతనం చేశారు. ఈ మేరకు వైన్స్ నిర్వహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు. పోలీసులతో పాటు క్లూస్ టీం సభ్యులు విచారణ చేపడుతున్నారు.


అర్లి సమీపంలో ఆర్టీసీ బస్సు చక్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ఊడిన బస్సు టైరు.. తప్పిన ప్రమాదం

భీంపూర్, ఆగస్టు 4: మండలంలోని అర్లి(టి) గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సు ఆదిలాబాద్ నుంచి కరంజి(టి) వైపు వస్తుండగా చక్రం ఊడిపోయింది. దీంతో గమనించిన డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. ప్రయాణిస్తున్న 30 మంది ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఈ రోడ్డు విషయమై ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులకు సంబంధిత అధికారులకు విన్నవించినా.. ప్రయోజనం లేదని పెద్ద ప్రమాదం జరుగక ముందే రోడ్డు పనులు ప్రారంభిస్తే బాగుంటుందని వేడుకుంటున్నారు.



నేడు వాల్ పెయింటింగ్ పోటీలు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 4: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఈనెల 5న ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, వాల్ పెయింటింగ్ పోటీలు నిర్వహించ తలపెట్టినట్లు మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఉదయం 8 గంటలకు జిల్లాకేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమీపంలో వాల్ పెయింటింగ్ పోటీలు ఉంటాయని, పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని పేర్కొన్నారు.

రోడ్డు కోసం గుట్టపక్క తండా వాసుల ఆందోళన



● బురదమయంగా మారిన గుట్టపక్క తండా రోడ్డు ఇదే..



గ్రామంలోని బస్టాండ్ వద్ద రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

బోథ్, ఆగస్టు 4: మండలంలోని గుట్ట పక్క తండా గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా కాకపోవడంతో నడిచేందుకు వీలులేకుండా పోవడంతో వల్ల ఆ గ్రామస్తులు ఆదివారం ఉదయం రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. తమ గ్రామంలోకి వెళ్లే రోడ్డు బురదమయంగా మారడంతో గ్రామం నుంచి బయటకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదంటూ.. అందుకు నిరసనగా రాస్తారోకో చేపట్టామన్నారు. అయితే విషయాన్ని తెలుసుకున్న ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థులను సముదాయించి రాస్తారోకో విరమింప చేశారు. కాగా, రాస్తారోకో వల్ల అరగంట పాటు పెద్దసంఖ్యలో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇకనైనా అధికారులు గ్రామస్థుల ఇబ్బందులను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పూల తోట.. బతుకు బాట!

- జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల సాగువైపు రైతన్నల చూపు
- వివిధ రకాల పూల సాగుతో లాభాలు గడిస్తున్న రైతులు
- ఆ ఊరిలో ఇంటింటా పూల తోటలే..
- మల్లెపూలు, చామంతుల ద్వారా రోజుకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు సంపాదన
- ఉట్నూర్ మండలం షాంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గోదారిగూడవాసుల విజయగాథ



● గోదారిగూడలో ఇంటి ముందు మల్లెపూలు సాగు

ఉట్నూర్, ఆగస్టు 4: జిల్లాలో పంటలు పండిస్తూ విసిగిపోయిన రైతులు.. పూలతోటల సాగు ద్వారా బతుకుబాట పడుతుందని భావించారు. పంటలు పండిస్తూ దిగుబడి రాక, పెట్టిన పెట్టుబడి వెళ్లక, అప్పుల ఊబిలో కూరుకుపోవడం కంటే ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని భావించారు. దీనిలో భాగంగా ఉట్నూర్ మండలంలోని షాంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గోదారిగూడ గ్రామానికి చెందిన రైతు కామెరా బానయ్య చూపెట్టిన దారిలో ఆ గ్రామ రైతులు ముందుకు కదిలారు. ప్రస్తుతం పూల సాగుతో లాభాలు గడిస్తున్నారు. గోదారిగూడ గ్రామంలోని ఎస్సీ వర్గానికి చెందిన పలువురు రైతులు తమకున్న చాలీచాలని వ్యవసాయ భూములలో వాణిజ్య పంటలు పండిస్తూ.. ఇళ్ల ముందు ఉన్న స్థలాల్లో వివిధ రకాల పూల తోటలను సాగు చేస్తున్నారు. గోదారిగూడ గ్రామంలో పది మంది వరకు రైతులు పూల సాగు ద్వారా ఉపాధి పొందుతు న్నారు. తమ పూల తోటల్లో మల్లెపూలు, చామంతి పూలు సాగు చేస్తున్నారు. రోజుకు ఒక్కొక్క రైతు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు పూలు విక్రయిస్తూ లాభాలు అర్జిస్తున్నారు. శుభకార్యాలు నిర్వహిస్తున్న వారు ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఉట్నూర్, జైనూర్, నార్నూర్, తదితర ప్రాంతాల నుంచి వచ్చి తమకు కావాల్సిన చామంతులు, మల్లెపూలు కొనుగోలు చేసుకుని వెళ్తున్నారని రైతులు వివరించారు. అంతేకాకుండా పర్వదినాలతో పాటు, అయ్యప్ప, సాయి, హనుమాన్ దీక్షదారులు తమ గ్రామానికి వచ్చి పూలు కొనుగోలు చేసుకుని వెళ్తుంటారని తెలిపారు. ఈ గ్రామానికి చెందిన ప్రతీ రైతుకు రెండు నుంచి ఐదు ఎకరాల వరకు భూములు ఉన్నాయి. ఈ భూముల్లో పత్తి, గోధుమ, జొన్న, కంది, వేరుశనగ లాంటి పంటలు పండించడంతో పాటు కొద్ది భూముల్లో వివిధ రకాల పూలు సాగు చేస్తున్నామని రైతులు వివరించారు.



● గోదారిగూడ వద్ద వ్యవసాయ భూమిలో పూల తోట సాగు చేస్తున్న దృశ్యం

ప్రధాన రహదారిపైనే గ్రామం

ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపై గోదారిగూడ గ్రామం ఉండడంతో ఈ గ్రామ రైతులకు పూల సాగు బహుబాగుగా కలిసి వచ్చింది. కష్టపడే మనస్తత్వం ఉన్న రైతులు కావడంతో ఇంటిల్లిపాది పంటల సాగుపై దృష్టి పెడుతున్నారు.

రోడ్డు పక్కనే పూల వ్యాపారం

ఇళ్ల ముందు, వ్యవసాయ భూముల్లో ఉన్న పూల తోటల్లో సాగు చేస్తున్న పూలను విక్రయించడానికి రైతులు ప్రధాన రహదారి వెంట దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. మహిళలు రోడ్డు పక్కన ఉన్న దుకాణాల్లోనే పూలదండలు కట్టి విక్రయిస్తుండడంతో ఈరోడ్డు గుండా వచ్చిపోయే వారు పూలు కొనుగోలు చేసుకుని వెళ్లడం గమనార్హం.

రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో వివిధ రకాల పూల సాగు

: గోదారి బాబు, పూల సాగు రైతు, గోదారిగూడ



నాకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో వాణిజ్య పంటలతో పాటు పూల తోటలు సాగు చేస్తున్నాను. ప్రధాన రహదారిపై పంచర్ దుకాణం పెట్టుకోవడంతో పాటు పూల దుకాణం నిర్వహిస్తున్నా. సుమారు రోజుకు రూ.వెయ్యి వరకు సంపాదిస్తా. అంతేకాకుండా నా భార్య కూడా పక్కనే ఇంద్రవెల్లికి వెళ్లి మల్లెపువ్వులు మూర రూ.20 చొప్పు విక్రయించి నాకు చేదోడువాదోడుగా నిలుస్తుంది.

రోడ్డు పక్కనే పూల వ్యాపారం

: రాజుబాయి, పూల సాగు రైతు, గోదారిగూడ



ఇంటి ఆవరణలో ఉన్న కొద్దిపాటి స్థలంలో పూల సాగు పనులు చేస్తుంటాం. రోడ్డు పక్కన చెట్టు కింద కూర్చుండి పూలు అమ్ముతాం. కాగా, రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ఆగి మరీ పూలు కొనుగోలు చేసుకుని వెళ్తుంటారు. దీని ద్వారా రోజుకు రూ.500 నుంచి రూ.600 వరకు వివిధ రకాల పూలను విక్రయిస్తుంటాను.



బోథ్‌లో కొమురంభీం విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

9న ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయండి : తుడుందెబ్బ

బోథ్, ఆగస్టు 4: ఈనెల 9న హైదరాబాదులో నిర్వహించనున్న ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. హైదరాబాదులో నిర్వహించే కార్యక్రమంలో ఆదివాసి సాంస్కృతి సంప్రదాయాలతో కూడిన ప్రదర్శన ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంలో పొందుపరిచిన 1950 ప్రకారం ఎస్టీలోని 9 ఉప తెగల రిజర్వేషన్ కల్పించాలని, ఐదవ షెడ్యూల్ ప్రాంతానికి కాపాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీలు వ్యాసాభాస ప్రకారం ప్రత్యేక కోడ్ కల్పించాలని డిమాండ్ చేశారు. పీసా చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి దుర్వా విశ్వాస, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షులతో పాటు పాట్నాపూర్ భీమ్ రావు, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు రామెల్లి భోజన్న, బోథ్ మండల అధ్యక్షులు కనక అమృతరావు, సోనాల మండల అధ్యక్షుడు మారుతి, తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

జాబ్ క్యాలెండర్ ప్రకటించడం హర్షనీయం : ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 4: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించడం హర్షనీయమని ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు కపిల్ అన్నారు. ఆదివారం స్థానిక లైబ్రరీలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో కలిసి ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు తినిపించుకుంటు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు కపిల్ మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీ సాక్షిగా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేశారన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో సాంకేతిక విద్యను అందించేందుకు ఉచిత కరెంట్‌ను ఇస్తున్నారని తెలిపారు. నిరుద్యోగులు, విద్యార్థుల పక్షాన ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 4: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా దేశంలో జరుగుతున్న పోరాటానికి సుప్రీం కోర్టు తీర్పుతో ముగింపు వచ్చిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్లేష్ అన్నారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బాబు జగ్జీవన్ రాం విగ్రహం ఎదుట సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చారు. అనంతరం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

దళితులు ఆర్థికంగా ఎదగాలి

● భీంపూర్‌లో చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే అనిల్

భీంపూర్, ఆగస్టు 4: దళితులు వ్యవసాయం చేసి ఆర్థికంగా ఎదిగి తమ పిల్లలకు ఉత్త విద్యను అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆయన ఆదివారం డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి భీంపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దళిత బస్తీ లబ్ధిదారులకు పెట్టుబడి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. తాంసి మండలం సావర్గం, తాంసి, పొన్నారి, భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలకు చెందిన దళిత బస్తీ 51 మంది లబ్ధిదారులకు పెట్టుబడి సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జడ్పీటీసీ కుంరా సుధాకర్, తాజీ మాజీ ఎంపీపీ కుడమేత సంతోష్, తాజా మాజీ వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, బీఆర్ఎస్ కన్వీనర్ మేకల నాగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అశోక్, మాజీ రైతు బంధు అధ్యక్షుడు మార్శెట్టి అనిల్, మాజీ సర్పంచ్‌లు మాడవి లింబాజీ, నరేందర్ యాదవ్, పడకంటి కృష్ణ, మూణేశ్వర్ భారత్, గంగయ్య, రాజన్న, నాయకులు ధరంసింగ్ రాథోడ్, జహూర్ అహ్మద్, షేక్ అఫ్రోజ్, నితిన్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



భీంపూర్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న అనిల్ జాదవ్

సంక్షిప్త సమాచారం



హస్నాపూర్‌లో గ్రామదేవతకు పూజల దృశ్యం

గ్రామ దేవతకు బోనాలు

ఉట్నూర్, ఆగస్టు 4: బోనాల పండుగ చివరి రోజున మండలంలోని హస్నాపూర్‌లో గ్రామస్థులు ఊరి బయటకు వెళ్లి గ్రామ దేవతకు బోనాలు సమర్పించుకున్నారు. గ్రామ దేవతకు కోళ్లు మేకలు బలిఇచ్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలు బాగా పండాలని గ్రామ దేవతలను కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సేధరినూరి అశక్షక్ తదితరులు పాల్గొన్నారు

సాటే జయంతి కార్యక్రమాల తేదీని ప్రకటిస్తాం

నార్నూర్, ఆగస్టు 4: దళిత, బలహీన వర్గాల ఆశాజ్యోతి, లోక్‌శ్యాహిర్ సాహిత్య సామ్రాట్ అన్నాబావు సాటే నార్నూర్ మండల జయంతి ఉత్సవ కార్యక్రమాల తేదీని త్వరలో ప్రకటిస్తామని అన్నాబావు సాటే నార్నూర్ మండల కమిటీ అధ్యక్షుడు కొర్రల మహేందర్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం సంఘ సభ్యులు నిర్వహించిన సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడారు. భారీ వర్షాలు కారణంగా ప్రాంత ప్రజలకు ఇబ్బందిగా ఉందని, గ్రామాలకు రాకపోకల సమస్యలు ఉన్నాయి. వాటి అన్నింటి దృష్ట్యా ఎవరికీ ఇబ్బందులు కలగవద్దని, పెద్దఎత్తున జన సమీకరణతో జయంతి ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ ఉత్సవ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఆహ్వానిస్తున్నామని, అందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు రాజు బర్కుంటే, శ్రీకాంత్‌మోరే, అనిల్, తదితరులున్నారు.

ఐటీఐ కళాశాలలో నూతన భవన నిర్మాణం

● ఉట్నూర్‌లో రూ.4.76 కోట్ల వ్యయంతో ఐటీఐ అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ● భూమిపూజ చేసి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

ఉట్నూర్, ఆగస్టు 4: మండలకేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో కొనసాగుతున్న ఐటీఐ కళాశాల విద్యార్థుల కోసం రూ.4.76 కోట్ల వ్యయంతో మంజూరైన అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ నూతన భవన నిర్మాణ పనులకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ ఆదివారం శంఖుస్థాపన నిర్వహించారు. ఆత్యాధునిక యంత్రాలు, పరికరాలతో సాంకేతిక విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ కృషి చేస్తుందని ఖానాపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. ఐటీఐ కళాశాల విద్యార్థుల కోసం రూ.4కోట్ల 76లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన అడ్వాన్స్ ఐటీఐ కళాశాల భవనాలు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న టెక్నాలజిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐ కళాశాల విద్యార్థులకు ఆత్యాధునిక టెక్నాలజి కలిగిన యంత్రాలు, పరికరాలతో విద్యను అందించేందుకు టాటా కంపెనీ సహకారంతో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు



ఎమ్మెల్యే పాయల శంకర్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే జన్మదినం

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 4: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ జన్మదిన వేడుకలను ఆదివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి అందరి సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఉదయం పాయల్ శంకర్ కుటుంబ సమేతంగా దుర్గానగర్ ఆలయం, ఆ తర్వాత పట్టణంలోని వేంకటేశ్వర స్వామి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు.

కాగా, ఎమ్మెల్యే శంకర్ జన్మదిన సందర్భంగా క్యాంపు కార్యాలయం ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రిమ్స్‌లో పేదల కోసం స్వచ్ఛందంగా రక్తదానం అందించి కార్యకర్తలు అభిమానం చాటుకున్నారు. దాదాపు వెయ్యి మందికి రక్తదానం చేశారు. ఇందులో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మా నంద్, బీజేపీ బేల మండలాధ్యక్షుడు దత్తు నికం, నాయకులు ఆదిత్య ఖండేశేకర్, మస్కరి పోతన్న, పాయల్ శరత్, బోడకుంట సిద్ధార్థ, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఆదివాసీలు

ఉట్నూర్, ఆగస్టు 4: ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆదివాసీ, లంబాడాల మధ్య నెలకొన్న ఝటిలమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ గళమెత్తినందున ఆదివారం మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా సార్‌మేడిలు, పటేళ్లు, ఆదివాసీ సంఘాల పెద్దలు ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని జిల్లా సార్‌మేడిలు, పటేళ్లు, ఆదివాసీ సంఘాల నాయకులు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జుపటేల్ మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. దశాబ్ద కాలంగా ఆదివాసీ, లంబాడా తెగల మధ్య జరుగుతున్న వైరుధ్యాలను నిర్మూలించడానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరడం జరిగిందని తెలిపారు. త్వరలో ఈ సమస్య పరిష్కారం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజల అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సార్‌మేడిలు, పటేళ్లు, ఆదివాసీ సంఘాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభం

నేరడిగొండ, ఆగస్టు 4: మండలంలోని పట్‌పడి తాండ, మాట్లోద్ది గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాలను బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఆర్టీ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తోందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందన్నారు. ఆయన వెంట బోథ్ వ్యవసాయ శాఖ ఉపాధ్యక్షుడు ఆడే వసంతరావు, బ్లాక్ అధ్యక్షుడు ప్రఫుల్ చందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, పోతరెడ్డి, కపిల్, రమేష్, మహేశ్, సంతప్, రాథోడ్ పాప, పరశురాం, శ్రీనివాస్, మార్కండేయ, వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.